
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 115 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృథు చరిత్ర -9

క్రితం నెల వ్యాసంలో విష్ణువు పంపిన సనక సనందనాదులు పృథువు దగ్గిరకి వచ్చి దీక్ష ఇచ్చారని చదివాం. వాళ్ళు వెళ్ళాక ఈయన ఏం చేసాడనేది ఇప్పుడు చెప్తున్నాడు. మనకి తెల్సిన ప్రకారం మానవుడిగా పుట్టాక, బ్రహ్మచర్యం, గృహస్తు జీవితం, ఆ తర్వాత వానప్రస్థం, సన్యాసం ఆ పైన ముక్తి కదా? పృథువుకి దీక్ష ఇచ్చేనాటికి ఆయన గృహస్తు జీవితం గడుపుతున్నాడు. సరైన సమయానికి దీక్ష లభించింది.

ఆ. విను మహాత్మ! ముఖ్యుఁ డన నొప్పు వైన్యుఁడే
కాగ్రచిత్తుఁ డగుచు నాత్మనిష్ఠుఁ
డైనయట్టి తను నవాప్త కామునిఁ గాఁగ
బుద్ధిలోనఁ దలఁచె భూవరుండు. [4-637]

వైన్యుడు – వేనుడి వంశానికి చెందిన పృథువు – ఏకాగ్ర చిత్తంతో ఆత్మ నిష్టుడయ్యాడు. ఆ తర్వాత జరిగినదేమంటే, బుద్ధిలో ఆయనకి 'నాకు అన్ని కోరికలూ తీరినట్టే' అనిపించింది. అవాప్త = తీరిన, కాముడు, కోరికలు కలవాడు. ఇక్కడ కామం అంటే ఏ కోరికైనా సరే, శారీరక సంబంధమైనది ఒక్కటే కాదు. తాను పుట్టాక జనాలకి కావాల్సినవన్నీ చేసాడు. భూమి సుస్సంపన్నం అయింది. భగవంతుడు కనిపించి నువ్వు పరమపదం పొందుతావు అని చెప్పాడు. దానిక్కావాల్సిన దీక్ష కూడా దొరికింది, అదీ అసంభవం అనుకునే మహా యోగులనుంచి. ఇంక కావాల్సిందేమిటి? ఏమీ లేదు; అందుకే ఆవాప్త కాముడయ్యేడు.

సీ. కర్మంబులను యథాకాల దేశోచిత
బలవిత్తములు గాఁగ బరఁగు ధర్మ
ములను బ్రహ్మార్పణ బుద్ధినిఁ జేసి క
ర్మాసక్తుఁ డగుచు సమాహితుండు
ప్రకృతికంటెను దన్నుఁ బరమైన యాత్మను
గర్మసంచయ సాక్షిఁగాఁగ బుద్ధి
నర్థిఁ దలంచుచు నాచరించుచు నట్లు
మెఱసి సామ్రాజ్యలక్ష్మీ సమేత [4-639]

తే. మందిరోద్యాన వనభూములందు రాజ్య
గరిమ వర్తింపఁగా నహంకార రహితుఁ
డగుచుఁ దన చిత్తమున నింద్రియార్థములను
దగులకయ యుండె సన్మహోదారుఁ డగుచు. [4-639.1]

అయితే తాను రాజు కనక ఇంకా చేయాల్సిన పనులున్నాయి. బంధాలు అన్నీ ఒక్కేసారి తెంచేసుకుని పారిపోవడం కుదరదు కదా? ఆచరించే కర్మలన్నీ చేస్తూ వాటి వల్ల వచ్చే ఫలాలలో అనాసక్తి కనబరిచాడు. అంటే తాను సాక్షి లాగా ప్రవర్తించాడు. ఇదే కదా భగవద్గీతలో కర్మణ్యే వ్యాధికారస్తే అనే శ్లోకం చెప్పేది? సామ్రాజ్యం ఉన్నా తాను రాజైనా సరే అహంకారం వదుల్చుకుని మనసు ఏ ఇంద్రియాలలోనూ తగులుకోకుండా జాగ్రత్తపడ్డాడు. రమణ మహర్షి ఇదే అంటారు. ‘నిశ్శబ్దంగా కూర్చుని నేనెవర్ని అని ధ్యానం చేయి, మిగతావన్నీ అవే సర్దుకుంటాయి’ అని. అలా సాక్షిలాగా చూస్తున్నప్పుడు కోతిలా తిరిగే మనసు వెనక్కి వచ్చి లోపలకి చూడ్డం మొదలుపెడుతుంది. అదే పృధుచక్రవర్తి చేసిన పని ఈ గురు దీక్ష పొందాక.

చ. సరస వచోర్థ సత్పురుష సంఘ సమంచిత గీయమాన సు
స్థిర వరకీర్తి పూరము సుధీజన కర్ణము లందు నించి తా
నిరుపమ సౌమ్య భాషణ మనీషల చేతఁ బ్రజానురక్తుఁడై
ధరణిని రాజనామమునఁ దాఁ దగు రెండవ చంద్రుఁడో యనన్. [4-644]

తాను రాజు కనక రాజ్యం కూడా చేయాలి కదా, దానికోసం మంచిగా మాట్లాడాలి (సరస వచోర్థ); ఎవరితో? అందరితోనూ. అలా మంచి మాటలు రావడానికి సత్పురుషుల సాన్నిహిత్యం తప్పనిసరి. వాళ్ళు చేసే గానం తన కీర్తి (సమంచిత గీయమాన వరకీర్తి పూరము; పూరము అంటే ప్రవాహం) వింటూ అదే విధంగా తన మాటలు ఉండేలాగ చూసుకుంటూ ప్రజలకి  అనురక్తుడై (ఇష్టమైనవాడిగా) రాజ్యంచేసాడు. ఎలాగో కూడా చెప్తున్నాడు – రెండో చంద్రుడేమో అన్నట్టు. రాజుని పాలకుడు, చంద్రుడు అనడం అలవాటు కనక ఈ పృధువుని రాజచంద్రుడు – రెండో చంద్రుడు అంటున్నాడు.

వ. మఱియు నమ్మహాత్ముండు విజ్ఞానియు, వర్ధితాశేషస్వానుసర్గుండును, బ్రజాపాలకుండును, స్థావర జంగమ వృత్తి దాయకుండును, సత్పురుష ధర్మవర్తనుండును, నిష్పాదితేశ్వరాదేశికుండును నైన పృథుం డొక్కనాఁడు దన వార్ధకంబు నీక్షించి నిజాత్మజ నాత్మజుల యందు నిలిపి ప్రజలు చింతాతుర చిత్తులగుచుండ నిజభార్యాసమేతుండై యప్రతిహత నియమంబున వైఖానస సమ్మతంబైన యుగ్రతపంబు నందుఁ బూర్వంబున దిగ్విజయ ప్రవృత్తుండగు చందంబునం బ్రవృత్తుండై తపోవనంబునకుం జని; యందు. [4-645]

రాజ్యం ఏలిన కొన్నాళ్లకి వానప్రస్థం స్థితిలోకి వచ్చాడు. ముసలితనం వస్తున్నట్టూ గమనించాడు. ప్రజలని పిల్చి చెప్పాడు నాకు సమయం అయింది ఇంక వెళ్ళాలి అని. అలా భార్యతో కల్సి అడవుల్లోకి వెళ్ళాడు. ఇక్కడనుంచి ఆయన ఎలా ముక్తి పొందాడు, ఆయన తర్వాత రాజ్యం ఏమైంది అనేవి ఒక్కోటిగా పురంజనోపాఖ్యంగా వస్తాయి. ఈ వచనంలో విజ్ఞాని అన్నాడు మొదట్లో పృధువుని; ఎందుకంటే ఆ మాత్రం జ్ఞానం లేకపోతే వానప్రస్థం తీసుకుందాం ముక్తి కోసం అనే ఆలోచనే రాదు కదా?

మత్త. కందమూల ఫలాశియై బహుకాల ముగ్ర తపః పరి
స్పందుఁడై యటమీఁదటం దృణపర్ణ భక్షణ చేసి యా
చంద మేది జలాశి యై నృపసత్తముం డది మాని తా
మంద గంధవహాశి యయ్యెఁ గ్రమంబునన్ దృఢచిత్తుఁడై. [4-646]

ఆ రోజుల్లో మనుషులు ధృఢంగా ఉండేవారు కనక వానప్రస్థం వెళ్ళిన పృధువు తపస్సు ఎలా చేసాడో చెప్తున్నాడు. మొదట్లో కందమూలాలు తిన్నాడు. ఆపైన గడ్డిపరకలూ ఆకులూ (తృణ పర్ణ), ఆ పైన కేవలం నీరు మాత్రమే స్వీకరించాడు. అది కూడా అయ్యాక మొత్తం అన్నీ మానేసి వాయు భక్షణ (గంధ వహాశి, వాసనలు తీసుళ్ళేది – వాయువు) మాత్రమే చేసాడు. ఎలా చేసాడంటే, క్రమంగా, ధృఢచిత్తుడై.

రెండు విషయాలు గమనించారా? మొదటిది, సన్యాసం తీసుకోవడం అంటే మాటలు కాదు. ఎంతో నేర్పు, బుద్ధీ, జ్ఞానం, తెలివితేటలు ఉండాలి. దాదాపు అన్ని విషయాలూ బాగా తెలిసి ఉండాలి. అలా ప్రాపంచిక జీవితంలో గెల్చినవారే ఆ జీవితం వద్దు, పనికిరాదు, అందులో ఉండే సంతోషం కాకి బంగారం లాంటిది అని తెల్సి దాన్ని వదులుకుని సన్యాసం తీసుకుంటారు. ఆ పైన ఇటువంటివారికే జ్ఞానం లభిస్తుంది కానీ తిండిలేక, డబ్బులులేక సన్యాసం తీసుకునేవారు 'ఏదీ చేతకాని సన్నాసుల్లా' మిగులుతారు. ఈ విషయం బుద్ధుడు, స్వామి వివేకానంద జీవితాలలో చూడవచ్చు. వాళ్ళు ప్రాపంచిక జీవితంలో అతి ధైర్యవంతులు. అన్నింటిలోనూ గెల్చినవారు. ప్రాపంచిక జీవితం అంటే వళ్ళు అంతా కాలిపోతున్నట్టు అనుక్షణం అనిపించి సన్యసించారు. బుద్ధుడు కూడా ఎంతకీ తనకి బోధి/ధర్మం అవగతం అవ్వనపుడు ఇలా అనుకున్నాట్ట.

ఇహాసనే శుష్యతు మే శరీరం, త్వగస్థి మాంసం ప్రళయం చ యాతు
అప్రాప్య బోధిం బహుకల్ప దుర్లభాం నైవాసనాత్కాయమతశ్చలిష్యతే

*నా శరీరం శుష్కించిపోయి, చర్మం, మాంసం, ఎముకలు మట్టిలో కలిసిపోనీయి గాక, అనేకానేక కల్పాలు కష్టపడినా అందుకోలేని దుర్లభమైన బోధిని పొందకుండా ఈ ఆసనం మీదనుంచి లేచేది లేదు.* ఎంత దృఢమైన నిర్ణయమో చూసారా? ఇటువంటి నిర్ణయం తీసుకోవాలంటే ఎంతటి మనోబలం ఉండాలి? అటువంటివారికే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది కానీ కాషాయం ధరించిన అందరికీ కాదు. అదే పద్యంలో చెప్పిన "ధృడచిత్తుడై" అనేది.

రెండో విషయం ఏమిటంటే, ఎటువంటివారికైనా సరే సాధన చేయకుండా ఆత్మసాక్షాత్కారం అసంభవం. మహావిష్ణువు నాకు మాట ఇచ్చాడు, నా గురువులు సనకసనందనాదులు, ఆత్మసాక్షాత్కారం దానికదే చేతిలో అరిటిపండులా వచ్చి పడుతుంది అనుకోలేదు పృధువు. వాళ్ళు చెప్పారు, సాధన చేస్తే వస్తుంది అందుకే నేను సాధన చేస్తున్నాను అనుకుంటూ భగవంతుడి కోసం తపించాడు. అంటే గురువు ఎంత గొప్పవాడైనా మనం సాధన చేయకపోతే ఆయన ఏమీ చేయలేడు. బుద్ధుడు చెప్పేది కూడా దాదాపు ఇదే. బోధి అనేది ఉంది; అది పూర్వకాలం బుద్ధులు చూసారు.

ముందు రాబోయే బుద్ధులు కూడా చూస్తారు. తాను ఎవరికైనా సరే మార్గం చూపించగలడు కానీ బోధిని తీసుకొచ్చి చేతిలో పెట్టలేడు. ఉద్ధరేదాత్మ ఆత్మానం (భగవద్గీత). ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి.

వ. అతి ఘోరం బయిన తపం బాచరించె; నివ్విధంబునం గ్రమానుసిద్ధం బయిన తపంబున విధ్వస్తాశేష
కర్మమలాశయుండును బ్రాణాయామంబులచే జితారిషడ్వర్గుండును ఛిన్నబంధనుండును నై బురుషశ్రేష్ఠుం డైన
పృథుచక్రవర్తి భగవంతుం డైన సనత్కుమారుం డెఱింగించిన యోగమార్గంబున సర్వేశ్వర భజనంబు గావించె; నిట్లు
భగవద్ధర్మపరుండును సాధువర్తనుండును శ్రద్ధాసమన్వితుండును నైన పృథునకు నారాయణు నందు భక్తి,
యనన్యవిషయంబై ప్రవృద్ధం బయ్యె; నవ్విధంబున. [4-649]

ఈ వచనంలో తపస్సు ఎలా చేసాడో చెప్తున్నాడు. ప్రాణాయామంతోటి శేష కర్మలన్నింటినీ దగ్ధం కావించాడు. సనత్కుమారుడు చెప్పాడు కదా ఏంచేయాలో? అలా యోగమార్గంలో వెళ్ళేసరికి భగవంతుడిమీద భక్తి ఎక్కువైంది. జ్ఞానమార్గంలో ఓ స్థితి దాటాక సాధకుడు భగవంతుడి గురించి తప్ప మరో విషయం వినడానికి ఇష్టపడడు అంటారు రామకృష్ణులు. ఇదే పృధువుకు జరిగింది.

క. పరిపూర్ణంబగు భక్తిని
గర మనిశము సంశయాత్మకంబై చాలన్
వఱలిన హృదయగ్రంథిని
నిరసించు విరక్తి యుత మనీష జనించెన్. [4-651]

ఇలా తపస్సు చేసేసరికి పరిపూర్ణమైన భక్తి వల్ల మనసునీ హృదయ గ్రంథినీ తిరస్కరించే విరక్తి కలిగింది. ఈ విరక్తి వచ్చాక ప్రాపంచిక బాధలు దరిచేరవు కనక ఆత్మ జ్ఞానానికి అర్హుడు. ఈ స్థితిలో ఆత్మజ్ఞానం కావాలి అనే కోరిక తప్ప మరోటి ఉండదు. అయితే ఏ కోరికైనా సరే బంధాలకి కారణం కనక ఆ చివరి — ఆత్మ జ్ఞానం కావాలి అనే – కోరిక కూడా బంధమే. అది కూడా వదుల్చుకున్నప్పుడు మాత్రమే ఆత్మ జ్ఞానం కలుగుతుందిట.

అలా పృధు చక్రవర్తి యోగమార్గంలో చరిస్తున్నప్పుడు, ఓ ఆసనంలో కూర్చుని మూలాధారం నుంచి శక్తిని పైకి లేపాడు. అక్కడనుంచి నాభిమీదకీ, హృదయం మీదకీ ఆ పైన శిరస్సులో ఉండే సహస్రారం మీదకీ పోనిచ్చి ప్రాణాలు విడిచాడు. అంటే యోగిలాగా కపాలంలోంచి ప్రాణం విడిచాడు బ్రహ్మరంధ్రం నుంచి.

వ. మఱియు భూమి నుదకంబునందును, నుదకంబును దేజమందుఁ, దేజంబును వాయువున, వాయువు నాకాశంబునందు,నాకాశంబును మనంబున, మనంబు నింద్రియంబుల, నింద్రియంబుల తన్మాత్రలఁ, దన్మాత్రల భూతాదియైన యహంకారంబు నందు, నహంకారంబు మహత్తత్త్వంబు నందును గూర్చి, యట్టి సర్వకార్యహేతుభూతం బైన మహత్తత్వంబును జీవోపాధిభూతంబయిన ప్రకృతి యందుఁ గలిపి జీవభూతుం డయిన పృథుండు జ్ఞాన వైరాగ్యంబులచేత బ్రహ్మనిష్ఠుండై మాయోపాధిం బాసి ముక్తుండయ్యె;" నని చెప్పి వెండియు నిట్లనియె.

[4-654]

పృథువు పార్థివ శరీరం భూమిలో కలిసింది. అయితే ఆయన ముక్తి పొందాక పంచభూతాల వల్ల ఈ శరీరం ఎలా ఉత్పత్తి అవుతుందో ఆ విధంగా భూమిని జలంలోను, జలాన్ని తేజస్సులోను, తేజస్సును వాయువులోను, వాయువును ఆకాశంలోను, ఆకాశాన్ని మనస్సులోను, మనస్సును ఇంద్రియాలలోను, ఇంద్రియాలను తన్మాత్రలలోను, తన్మాత్రలను అహంకారంలోను, అహంకారాన్ని మహత్తత్త్వంలోను ఏకం చేసాడు. ఆ మహత్తత్త్వాన్ని ప్రకృతిలో కలిపాడు. అలా పృథుచక్రవర్తి జ్ఞాన వైరాగ్యాల ప్రభావంతో బ్రహ్మనిష్ఠుడై ముక్తి పొందాడు. ఈ పద్ధతి యోగులకి మాత్రమే చేతనౌతుందిట. మిగతావారికి ఇంద్రియాలు మనసులోకి లాగబడి మనస్సు చుట్టూ ఇవన్నీ ఉండిపోయి చేసుకున్న కర్మల ప్రకారం మరో జన్మ కలుగుతుంది.

పృథువు తాను చేయగలిగింది చేసి ముక్తి పొందాక తర్వాత కథ వచ్చే వ్యాసంలో చూద్దాం.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS